ప్రజాసమస్యలపై గొంతెత్తి గర్జించిన కేసీఆర్

- తలొగ్గిన సర్కారు.. సమస్యలకు పరిష్కారం
- రైతులను పరామర్శించిన గంటల్లోనే నీళ్లు
- రైతుబంధుపై ప్రశ్నించిన తర్వాతే నిధులు
- రుణమాఫీపై నిలదీశాకే 'ఆగస్టు 15' గడువు
- పంటనష్టంపై ప్రశ్నించగానే 15 కోట్లు రిలీజ్
- చేనేతన్నల కార్మికులకు బకాయిలు విడుదల
- మరి బీఆర్ఎస్‌కు డజనుకుపైగా ఎంపీలను ఇస్తే?

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ):

'నాకు చేతనైనా కాకపోయినా.. నా కట్టె కాలేవరకు తెలంగాణకు అన్యాయం జరిగితే పులిలాగా కొట్లాడుత. అంతేతప్ప పిల్లిలాగా ఉండను. ఆరునూరైనా తెలంగాణకు ఏ విషయంలోనూ అన్యాయం జరగనివ్వను'.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తరచూ చెప్పే మాటలివి. దానికి తగ్గట్టే కేసీఆర్ మూడు నెలలుగా రాష్ట్ర ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారు.

ముఖ్యంగా గత నెలన్నర రోజుల్లో ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలబెట్టారు. ప్రజాసమస్యలపై గొంతెత్తి గర్జిస్తున్నారు. కోట్ల మంది ప్రజాగొంతుకకు రాష్ట్ర ప్రభుత్వం జడిసి, అనేక సమస్యలను పరిష్కరిస్తున్నది. కొన్నింటికి గడువు విధిస్తున్నది. ఎన్నికల్లో ఓటమి తర్వాత కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని కేసీఆర్ భావించారు.

దురదృష్టవశాత్తు తుంటి ఎముక విరగటంతో రెండు నెలలు విశ్రాంతి తీసుకున్నారు. ఫిబ్రవరి 13న 'చలో నల్లగొండ' సభతో తిరిగి ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టారు. అప్పటి నుంచి ప్రజాసమస్యలపై గళం ఎత్తుతూనే ఉన్నారు. ఎండిపోయిన పంటల పరిశీలన, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు మార్చిలో ప్రత్యేక యాత్ర మొదలుపెట్టారు. అప్పటి నుంచి అనేక సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నారు. కేసీఆర్ గొంతెత్తితే.. సర్కార్ తలొగ్గుతున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

రైతులకు నీళ్లెందుకివ్వరు?

రైతుల గోసను వినేందుకు కేసీఆర్ మార్చి 31న జనగామ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించారు. తర్వాత ఏప్రిల్ 1న నల్లగొండ జిల్లాలో పర్యటించారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. కాళేశ్వరం నుంచి, దేవాదుల నుంచి నీళ్లు ఎందుకు ఎత్తిపోయడం లేదు? అని ప్రశ్నించారు.

తలొగ్గిన సర్కార్

మార్చి 31న మధ్యాహ్నం 3.30 గంటలకు కేసీఆర్ పర్యటన పూర్తయితే.. సాయంత్రం 4.30 గంటలకు కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంప్‌హౌజ్‌లో మోటర్లు స్టార్ట్ అయ్యాయి. లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ నుంచి నీటిని ఎత్తిపోశారు. నల్లగొండ జిల్లాలోనూ ఏప్రిల్ 1న పర్యటన చేపట్టిన మరుసటి రోజే నాగార్జునసాగర్ ఎడమ కాలువ గేట్లు తెరుచుకున్నాయి. కాలువల్లోకి నీళ్లు పారాయి.

రైతుబంధు అందరికీ ఇవ్వాల్సిందే!

రైతుబంధును మొదలు పెట్టినప్పటి నుంచి ప్రతి రైతుకు, ప్రతి ఎకరానికి పెట్టుబడి సాయం అందించామని తన ప్రసంగాల్లో కేసీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఐదు ఎకరాలకే పరిమితం చేయాలని చూస్తున్నదని, మరి ఆరు ఎకరాలు, ఏడు ఎకరాలు ఉన్నోళ్లు ఏం పాపం చేశారు? అని ప్రశ్నించారు. ఇస్తే అందరికీ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.

తలొగ్గిన సర్కార్

ఐదు ఎకరాలకుపైన ఉన్న రైతులకూ రైతుబంధు నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 6 నుంచి ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో చేరుతాయని చెప్పింది. దీంతో ఐదున్నర లక్షల మంది రైతు కుటుంబాలు సంబురపడ్డాయి

రుణమాఫీ ఇంకెప్పుడు?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రుణమాఫీ చేయకపోవటంపై కేసీఆర్ నిలదీశారు. 'రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోండి. మేము అధికారంలోకి వస్తే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిండు. మరి రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందా?' అని ప్రతి రోడ్‌షోలో, ప్రతి సభలో కేసీఆర్ ప్రజలను ప్రశ్నించి, సమాధానం రాబట్టారు.

తలొగ్గిన సర్కార్

రుణమాఫీపై మొదట్లో నోరు మెదపని ప్రభుత్వం.. కేసీఆర్ ప్రశ్నకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి తలొగ్గక తప్పలేదు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఆ మాటను ప్రజలు నమ్మకపోవటంతో ఎక్కడికి వెళ్తే అక్కడి దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారు.



మాటతోనే మెడలు వంచిండు!

బీఆర్ఎస్‌కు డజనుకుపైగా ఎంపీ సీట్లు ఇస్తే?

కేసీఆర్ ఓ సందర్భంలో 'ప్రజలు మాకు ప్రతిపక్షంలో ఉండే బాధ్యత అప్పగించారు. ఆ పాత్రను సమర్థంగా పోషిస్తాం. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై కొట్లాడుతం' అని చెప్పారు. దీనికి తగ్గట్టే దాదాపు 45 రోజులుగా చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజాసమస్యలకు గొంతుకగా నిలిచారని విశ్లేషకులు చెప్తున్నారు. అనేక సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి.. దిగివచ్చి, పరిష్కరించేలా చేశారని వెల్లడించారు. మాటలతోనే ప్రభుత్వాన్ని తలొగ్గేలా చేయగలిగితే.. కేసీఆర్ చెప్తున్నట్టుగా ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డజనుకుపైగా ఎంపీ సీట్లు వస్తే తెలంగాణకు ఎంతో చేస్తారు అని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు కూడా ఇదే కోణంలో ఆలోచిస్తున్నారని, తెలంగాణ ఆకాంక్షలు నెరవేరాలన్నా, గోదావరిని ఇతర రాష్ట్రాలకు మళ్లించవద్దన్నా, కృష్ణాలో నీటిని కాపాడుకోవాలన్నా, జిల్లాలు రద్దుకాకుండా ఆగాలాన్నా, ఇతర సమస్యలు పరిష్కారం కావాలన్నా బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే సాధ్యం అవుతుందన్న భావన ప్రజల్లో బలంగా కనిపిస్తున్నదని పేర్కొంటున్నారు.

కరెంట్ ఇచ్చే తెలివి లేదా?

తెలంగాణను తాము అంధకారం నుంచి విద్యుత్తు కాంతులతో నింపితే, కాంగ్రెస్ హయాంలో ఎడాపెడా కరెంటు కోతలు మొదలయ్యాయని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కరెంటు తొమ్మిదేండ్లు సక్కగా వచ్చింది కదా.. కేసీఆర్ దిగంగనే కట్కబంద్ చేసినట్టు ఎట్లా పోతది?' అని నిలదీశారు. కేసీఆర్‌తో పాటు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటనల సమయంలోనూ కరెంటు కోతలు ఎదురవడాన్ని ప్రస్తావించారు.

తలొగ్గిన సర్కార్

కరెంటు కోతలను నివారించలేపోయినా.. సీఎం, మంత్రులు, కేసీఆర్, ఇతర ప్రముఖుల పర్యటనలు ఉన్న ప్రాంతాల్లో కరెంటు పోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రచార సభలు, ప్రముఖులతో చర్చలు జరిగే ప్రాంతాల్లో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేకంగా విద్యుత్తు సిబ్బందిని మోహరించి, జాగ్రత్త పడుతున్నారు.

ఎకరాకు 25 వేలు ఇవ్వాలి!

ఎండిపోయిన పంటలను, అకాల వర్షాలతో పంట నష్టం జరిగిన ప్రాంతాలను పరిశీలించేందుకు కేసీఆర్ ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.25 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తలొగ్గిన సర్కార్

ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించి, సమగ్ర వివరాలు సేకరించింది. అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో పంట నష్టపోయినట్టు గుర్తించింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని ఏప్రిల్‌లో నిర్ణయించింది. తాజాగా రూ.15 కోట్లు విడుదల చేసింది.

బోనస్. బోగసేనా?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇచ్చి కొంటామని హామీ ఇచ్చింది. మ్యానిఫెస్టోలోనూ చెప్పుకొన్నది. అయితే.. అధికారంలోకి వచ్చిన తర్వాత యాసంగి కొనుగోళ్లకు బోనస్ ఇవ్వకపోవటంతో కేసీఆర్ ప్రశ్నించారు. 'రూ.500 బోనస్ వచ్చిందా? బోనస్ బోగస్ అయ్యింది కదా?' అని ప్రజాక్షేత్రంలో నిలదీశారు.

దిగొచ్చిన సర్కార్

యాసంగి కొనుగోళ్లకు బోనస్‌పై ప్రభుత్వం చేతులెత్తేసింది. అయితే.. వానకాలం వచ్చే సీజన్ నుంచి ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగా ప్రతి పంటకు బోనస్ ఇస్తామని మాత్రం ఇంకా చెప్పడం లేదు.

నేతన్నకు బకాయిలు విడుదల చేయాలి

చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చి చేనేత కార్మికులను ఆదుకుంటుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేసిందని మండిపడ్డారు.

తలొగ్గిన సర్కార్

మొదట్లో మొండికేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ తర్వాత దిగివచ్చింది. చేనేత కార్మికులకు రూ.351 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా.. ఏప్రిల్ 19న రూ.50 కోట్లు విడుదల చేసింది.

కాళేశ్వరాన్ని బాగుచేస్తా..!

మేడిగడ్డ బరాజ్‌ను మరమ్మతులు చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. కుంగిపోయిన మూడు పిల్లర్లను రిపేర్ చేయించాల్సిందిపోయి మొత్తం కూలిపోయే పరిస్థితికి తెస్తున్నారని మండిపడ్డారు. 'వానకాలం నాటికి మరమ్మతులు చేయించకపోతే 50 వేల మంది రైతులను తీసుకెళ్లి, ఎవరు అడ్డం వచ్చినా పండబెట్టి తొక్కుకుంటూ పోయి రిపేర్ చేయిస్తా' అని ప్రకటించారు.

తలొగ్గిన సర్కార్

మొదట్లో ఎన్డీఎస్ఏ నుంచి పూర్తి స్థాయి నివేదిక వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టబోమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఎన్డీఎస్ఏ నుంచి మధ్యంతర నివేదికను తెప్పించుకున్నది. కుంగిన పిల్లర్లను రిపేర్ చేయించాలని అందులో నిపుణులు పేర్కొనటంతో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయ్యింది. దీంతో మరమ్మతులు చేయించటంపై దృష్టిపెట్టింది.

ఓయూను మూసేస్తారా?

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని హాస్టల్, మెస్‌లను మే 1 నుంచి 31 వరకు మూసివేస్తున్నట్టు చీఫ్ వార్డెన్ ప్రకటన విడుదల చేసినట్టు ప్రచారం జరిగింది. దీంతో కేసీఆర్ ఫైర్ అయ్యారు. హాస్టళ్లను ఎందుకు మూసివేయాల్సి వస్తున్నదంటూ ట్వీట్ చేశారు.

తలొగ్గిన సర్కార్

కేసీఆర్ ట్వీట్ చేసిన 24 గంటల్లోనే ప్రభుత్వం దిగివచ్చింది. హాస్టళ్లను తెరిచే ఉంచుతామని ఓయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు నిర్ణయం తీసుకుంటున్నట్టు చెప్పారు.

పడిలేచిన కెరటం బీఆర్ఎస్

మలుపు తిప్పిన జననేత కేసీఆర్ బస్సు యాత్ర.. చెక్కు చెదరని క్యాడర్.. తరగని ప్రజాభిమానం.. బీఆర్ఎస్‌తో రెండు జాతీయ పార్టీల ఎదురీత

12 చోట్ల బీఆర్ఎస్‌తో హస్తం, కమలం పోటీ.. ఐదు సీట్లలో కాంగ్రెస్, ఏడు సీట్లలో బీజేపీ.. నాలుగు స్థానాల్లో మాత్రమే త్రిముఖ పోటీ

బీఆర్ఎస్ గ్రాఫ్ పెరగడానికి బీజేపీనే కారణం.
- పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి తప్పిదాల వల్లనే బీఆర్ఎస్ తిరిగి లేచి కూర్చుంది.
- బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి

(వీరిద్దరూ ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ పార్టీలు తెలంగాణలో బీఆర్ఎస్‌తో పార్లమెంట్ ఎన్నికల్లో తలపడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందని వీరిద్దరూ అంగీకరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావమే ఉండదన్న దశ నుంచి పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి ఈ పార్టీకి గ్రాఫ్ పెరిగిందని అంటున్నారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి బయలుదేరాక రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. ఉనికే ఉండదన్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు రెండు జాతీయ పార్టీల అభ్యర్థులు తలపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కాంగ్రెస్, బీజేపీల అంచనాలను ఒక్కసారిగా తారుమారు చేసింది.)

ఓటు బ్యాంకు నిలుపుకుంటున్నది

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పొందిన వెనువెంటనే వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు మరలుతున్నదా? లేక బీజేపీకి మరలుతున్నదా? అన్నది బిగ్ క్వశ్చన్‌గా ఉండేది. కానీ కేసీఆర్ తన బస్సుయాత్రతో ఓటు బ్యాంకు ఎక్కడికి వెళ్లకుండా నిలువరించగలిగారు. **- ప్రొఫెసర్ నాగేశ్వర్, రాజకీయ విశ్లేషకుడు**

కేసీఆర్ పట్ల అభిమానం తగ్గలేదు

కేసీఆర్ పార్టీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, క్యాడర్ కేసీఆర్ వెంటే ఉన్నారని, సామాన్య ప్రజలకు కేసీఆర్ పట్ల అభిమానం తగ్గలేదని బస్సుయాత్ర వెల్లడిస్తున్నది.
- పెంటపాటి పుల్లారావు, రాజకీయ విశ్లేషకుడు

కాంగ్రెస్, బీజేపీ ఆశలకు గండిపడింది

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఐదు నెలల్లోనే బీఆర్ఎస్ పార్టీ అనూహ్యంగా పుంజుకున్నది. రాజకీయ రణక్షేత్రంలో బీఆర్ఎస్ పడిలేవడంతో పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్, బీజేపీ పెట్టుకున్న ఆశలకు గండిపడింది.
- 'ది స్టేట్స్ మెన్', ప్రముఖ ఆంగ్ల దినపత్రిక

గట్టి పోటీ ఇస్తున్న బీఆర్ఎస్

రాష్ట్రంలో ఐదు నెలల కిందట అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీలకు గట్టి పోటీ ఇస్తున్నది. 3-4 స్థానాల్లో మినహా మిగతా అన్ని స్థానాల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్-బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్నది.
సీఆర్ గౌరీశంకర్, రిటైర్డు పొలిటికల్ ఎడిటర్, దక్కన్ క్రానికల్

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పని అయిపోయిందని కాంగ్రెస్, బీజేపీ సాగిస్తున్న ప్రచారంలో వీసమెత్తు నిజం లేదని తేలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచార సరళిని పరిశీలిస్తే ఈ రెండు జాతీయ పార్టీలు రాష్ట్రంలో 12 చోట్ల బీఆర్ఎస్‌తోనే తలపడాల్సి వస్తున్నదంటే ఇప్పటికీ గులాబీ బలం చెక్కు చెదరలేదనడానికి నిదర్శనం. తెలంగాణలో మొత్తం 17 పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్‌తో ఏడు చోట్ల బీజేపీ, ఐదు చోట్ల కాంగ్రెస్ పోటీపడుతుండగా, నాలుగు చోట్ల మాత్రమే త్రిముఖ పోటీ నెలకొన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైనా ఐదు నెలలు తిరక్కుండానే బీఆర్ఎస్ తన పూర్వశక్తిని పుంజుకొని పార్లమెంట్ ఎన్నికల బరిలో దూసుకుపోతుండటంతో ఇటు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు, అటు కేంద్రంలో అధికార బీజేపీకి ముచ్చెమటలు పడుతున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరుబాట పేరుతో చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి లభించిన స్పందన ఉప్పెనను తలపించింది. కేసీఆర్ పాలననే మళ్లీ కావాలని ప్రజలంతా ముక్తకంఠంగా నినదించారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా కేసీఆర్‌కు బ్రహ్మరథం పట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, వారి మాయమాటలకు మోసపోయి తప్పు చేశామని వాపోయారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ వల్ల తెలంగాణకు కించిత్తు మేలు జరిగిన దాఖలాలు లేవని పెదవి విరుస్తూ, బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. ఊహించని ఈ పరిణామం కాంగ్రెస్, బీజేపీల వెన్నులో వణుకు పుట్టించడంతో బెంబేలెత్తిన బీజేపీ అగ్రనేతలు ప్రధాని మోదీ, అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణ చుట్టే చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు 14 సీట్లు గెలుస్తామన్న కాంగ్రెస్, 10 సీట్లు గెలుస్తామన్న బీజేపీల అంచనాలు తలకిందులయ్యాయి. దింపుడుకళ్లం ఆశతో బీఆర్ఎస్ ప్రభంజనాన్ని నిలువరించేందుకు బీజేపీ, కాంగ్రెస్ కొన్ని చోట్ల చీకట్లో చేతులు కలపడానికి కూడా వెనుకాడటం లేదని రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం శనివారం ముగిసిన సమయానికి బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 చోట్ల విజ యావకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో 7 లక్షల ఓట్లే తేడా

పార్లమెంట్ బరిలో బీఆర్ఎస్ ఎందుకింత బలంగా ఉన్నదన్నదానికి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను పరిశీలిస్తే తెలుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 92,53,220 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 85,81,549 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 30,31,031 ఓట్లు మాత్రమే వచ్చాయి. బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు ఏడు లక్షలు (1.8 శాతం) మాత్రమే. ఈ స్వల్ప తేడాతో బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా కాంగ్రెస్ ఐదు నెలల పాలనపై ప్రజల్లో ఉహించని వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. మరో వైపు బీజేపీకి రాష్ట్రంలో బలమైన పునాదులు లేకపోవడంతో బీఆర్ఎస్ అత్యధిక ఎంపీ సీట్లు గెలుచుకొనే అవకాశాలు మెండుగా ఉన్నట్టు అనేక సర్వేల్లో వెల్లడైంది.

ఐదు సీట్లలో మాత్రమే కాంగ్రెస్ పోటీ

అధికార కాంగ్రెస్ కేవలం ఐదు నియోజకవర్గాల్లోనే బీఆర్ఎస్‌కు పోటీ ఇస్తున్నది. ఖమ్మం, పెద్దపల్లి, నల్లగొండ, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్యే పోటీ ఉన్నది. ఈ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకే విజయావకాశాలు మెండుగా ఉన్న ట్టు సర్వేలు చెప్తున్నాయి. ఈ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు కనీస పోటీ కూడా ఇచ్చే పరిస్థితి లేదని సర్వే నివేదికలు బయటపెట్టాయి.

ఏడు స్థానాల్లో బీజేపీ పోటీ

రాష్ట్రంలో బీజేపీకి బలం లేనప్పటికీ పలు నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్ బలహీనమైన అభ్యర్థులను బరిలోకి దించడంతో ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్-బీజేపీ మధ్య పోటీ నెలకొన్నది. వాస్తవానికి రాష్ట్రంలో బీజేపీకి 13 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి, కరీంనగర్, మెదక్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, వరంగల్, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ నుంచి ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవదేదు. కరీంనగర్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ బలహీనమైన అభ్యర్థులను బరిలో దించడం వల్ల గుడ్డిలో మెల్లగా బీఆర్ఎస్‌కు బీజేపీ అభ్యర్థులు మాత్రమే పోటీ ఇవ్వగలుగుతున్నారు.

కేసీఆర్ పట్ల ప్రజలకు తగ్గని క్రేజ్

బస్సుయాత్రలో కేసీఆర్‌కు రాష్ట్రమంతటా ప్రజ లు నీరాజనాలు పలికారు. కేసీఆర్‌ను చూడగానే సీఎం.. సీఎం అంటూ తాము ఏం కోల్పోయామో గుర్తు చేస్తున్నారు. తెలంగాణను కేసీఆర్ తన విజన్‌తో తీర్చిదిద్దిన తీరు, సంక్షేమం-అభివృద్ధి జోడెడ్లలా తీసుకెళ్లిన నైపుణ్యత, పే దలపై ఆయనకున్న ప్రేమ, వెరిసి కేసీఆర్ పట్ల ప్రజల్లో పాదుకుపోయిన అభిమానం ఎప్పటికీ చెక్కుచెదరని నిరూపితమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా క్యాడర్ చెక్కుచెదరలేదు. పార్టీ జెండా నీడలో పదవులు అనుభవించిన కొందరు నాయకులు పక్క చూ పులు చూసినా క్యాడర్‌లో మాత్రం కించిత్తు తడబాటు కనిపించకపోవడం బీఆర్ఎస్‌కున్న ప్రత్యేకత. క్యాడర్‌కు పార్టీపై ఉన్న నమ్మకం, కేసీఆర్‌పై ఉన్న అభిమానం, పరిపాలనా దక్షతపై ప్రజలకున్న విశ్వాసం దీనికి కారణం.